

“ఫ్రా...”





తెలుగు డిపార్ట్‌మెంట్ ముందున్న వరండా పిట్టగోడపై కూర్చొని ఉండగా మోహన సుందరంతోసహా ప్రత్యక్షమైంది మాలతి. మోహన సుందరం అట్లా నా కళ్ళలోకి సూటిగా చూస్తుంటే – గొప్ప భయం, జలదరింత. ముఖ్యంగా అతని గడ్డర్ ముఖం, ఆ గడ్డం, భుజంపై వేలాడే సంచీ, అతన్ని చూసినప్పుడల్లా ఏదో తెలియని పశ్చాత్తాపం నన్ను చుట్టుముట్టేది.

విశాలమైన రెండు చేతులు అట్లా ముందుకూ వెనక్కూ ఊగుతుంటే, నడుస్తున్న శిలువ గుర్తుకొస్తుంది. ఏదో ఒకరోజు శిలువపై వేళ్ళాడుతూ చౌరస్తాల నడుమ అతని శవం ఎదురుకావచ్చేమోనని భయం, ఎందుకో నన్ను వెంటాడేది.

అతన్ని హఠాత్తుగా నా ముందు ప్రత్యక్షం చేయించి ఏ వార్నింగ్ లేకుండా, నా చేతిని అతని చేతిలో పెడుతూ "మోహనా! ఇతనో గొప్ప రొమాంటిక్ పొయిట్! తనను తానో గొప్ప విధ్వంసగీతం అనుకొంటాడు. కవిగా ఇతని భవిష్యత్తు గురించి రెండు ముక్కలు చెప్పు!" అంది మాలతి.

నేను వారించే లోపలే అతను సంచిలోంచి ఒక ఊదారంగు పువ్వు, బెల్స్‌ఫ్లవర్ బయటకు తీశాడు.. దాన్ని నా అరచేతిలో పెట్టి గుప్పిట బిగించి "గొప్ప నీలి కవితలు సృష్టిస్తావు!" అంటూ నావైపు చూసి, కన్నుగీటి "అనార్కెస్టు ముఖం తొడుక్కొన్న గొప్ప సుఖవాదివి. పద్యాన్ని పట్టుకొని దేశాలన్నీ తిరుగుతావు" అన్నాడు. ఊదారంగు పువ్వు అట్లా నా చేతిలో నలిగిపోతూనే ఉంది.

మహాభినిష్క్రమణం కోసం వెళ్తున్నవాడిలా అతను చేతులు ఊపుకొంటూ వెళ్ళిపోయాడు.

మోహనసుందరం కాస్త దూరం వెళ్ళి, ఆగి "స్వప్నలో ఫైర్ సినిమా ఆడుతుంది. మీ యిద్దరు కలిసి చూడటం నాకానందం" అంటూ రెండు సినిమా టిక్కెట్లు మావైపు విసిరి, చకచకా నడుచుకొంటూ వెళ్ళిపోయాడు.

మాలతితో సహా నెంబర్ 136 బస్సు ఎక్కి, కోఠీ దగ్గర దిగి, అట్లాగే ఆబిడ్స్‌వైపు నడుచుకొంటూ వెళ్ళి, మధ్యలో బస్సుల, ఆటోల, స్కూటర్ల వరదల్ని దాటుకొంటూ హుస్సేన్ బుక్‌షాపు దగ్గర ఆగాము. నేను, లోపల ఎక్కడో మారుమూలవున్న పొయిట్రీ పుస్తకాల్ని తీయిస్తుంటే – ఈలోగా మాలతి కౌంటర్ దగ్గర కూర్చున్న వృద్ధుడి పక్కన కూర్చొని – అతని పాలిపోయిన ముఖాన్ని,

రహస్యమైన తప్పులా అతని చేతిలో మండుతున్న సిగరెట్టునూ విస్మయంగా చూస్తూ - అతనో గజల్‌గా ట్రాన్స్‌ఫార్మ్ కావటాన్ని ఆనందిస్తుంది.

నది, నావ, మనిషి, చావు అంతా ఒకటే అని అర్థంవచ్చే ఉర్దూ పాటను అతను ఆలపిస్తున్నాడు. చార్లెస్ బాద్లేర్ కవితల పుస్తకాన్ని తిరగేస్తూ నేనూ గొప్పగా ఎంజాయ్ చేస్తున్నానా పాటను. పాట అయ్యాక గొప్ప ఆయాసంవచ్చి, భీకరంగా దగ్గి, అతను హడావుడిగా నావైపు నడుచుకొంటూ వచ్చాడు. పక్కనున్న సింక్ దగ్గర బుళుక్కుమంటు రక్తం కక్కి - భయంతో బిగుసుకుపోయాను.

"బేటా! ఇంకెంత! సిరిఫ్ పంద్రాదిన్!" అన్నాడు నవ్వుతూ నావైపు చూస్తూ, "క్యాన్సర్! చివరిదశ!" అన్నాడు. నావైపే చూస్తూ "అచ్ఛా, రెండు లైన్ల పొయిట్రీ ఏదైనా చెప్పు!" నా పక్కనే ఉన్న స్టూల్‌పై కూలబడుతూ.

బాద్లేర్ పుస్తకాన్ని చటుక్కున తెరిచి "I cast her to the bottom of a well; and on top of her I piled; All the story of the Parapet- I will forget her, if I can!" అనే కవిత చదివావా "వాహ్‌వా! వాహ్‌వా!" అంటూ పరవశంతో పెద్దగా అరిచి, జేబులోంచి బంగారు పూతపూసిన పెన్ను ఒకటి చేతిలో పెట్టాడు.

"గొప్ప గొప్ప అనుభవాల్ని, కవితల్ని విన్నాక మనసు ఊరుకోదు. ఏదైనా నజరానా యివ్వాలనిపిస్తుంది" అని సంజాయిషీలాగా చెప్పాడు.

"డాక్టర్ బెడ్ దిగవద్దన్నాడు. హాస్పటల్‌లో ఎవరికీ తెలియకుండా ఇట్లా వచ్చాను. ఈ పుస్తకాన్ని చూస్తూ, మీలాంటి పిల్లల్ని చూస్తూ, ఇట్లా నాలుగు మంచి షాయిరీలు వింటూ - మంచి గజల్ వింటూనో, పాడుతూనో చనిపోవాలని నా కోరిక!" జేబులోంచి కాసిన్ని నలిగిన కాగితాలు తీశాడు. ఆయన రాసిన కవితలు కాబోలు. ఆ కాగితాల మధ్య ఆయన చేతిగుడ్డ, రక్తంతో బాగా స్టెయిన్ అయినది.

మరింక అక్కడ ఉండాలనిపించలేదు. మాలతి చేతిని అందుకొని గబగబా పేవ్‌మెంట్‌పైకి వచ్చి - చాలా దూరం నడిచాక, జేబులోంచి ఊదా రంగు పువ్వును బయటకు తీసి - గుప్పిటలో బిగించి, క్రూరంగా నలిపి -

"మనం ఇక్కడ విడిపోవాలి ! నువ్వు నిజం కాదు! మోహనసుందరం నిజం కాదు! ఆ ముసలి కవి మరణం నిజం కాదు!

ఇదుగో ఈ పువ్వు నిజం కాదు! దీని డెడ్‌బాడీ సాక్షిగా, ఇవాళ మనమూ కవిని కలవలేదు! ఇవాల్టిని కొట్టి వేస్తున్నాను! గుడ్‌బై!" అంటూ చరచరా నడుచుకొంటూ వెళుతుండగా... "ఇవాళ గొప్ప చారిత్రాత్మకమైన రోజు! ఈ

శతాబ్దానికే ఇది ఆఖరు రోజు. డిసెంబర్ ముప్ఫయి ఒకటి పందొమ్మిది వందల తొంభై తొమ్మిది!" మాలతి సన్నని నవ్వు నా కాళ్ళకు చుట్టుకొంటూ ఉండగా నేను కోఠీ బస్టాప్‌వైపు నడిచాను.

* * *

అంతా గమ్మత్తు, అంతావ్వెవ్వే అనుకొన్న కబుర్లన్నీ పచ్చి నిజాలనీ - నీలాకాశం, సూర్యుడి దిగులు, కృశించిన ముఖాలు, ఆకలి, శరీర హింస - ఇవన్నీ ఒక వాతావరణం కోసం మనం సృష్టించుకొన్న నేపథ్యం అనుకొన్నాను గానీ అవన్నీ ఒక మిస్టలా మనల్ని వేటాడతాయని ఎట్లా అనుకోను.

ఈ మాలతి మాత్రం "పొంచి వున్న దుఃఖం. ఆమె ఒక దుఃఖగాథ" అంటాడు మోహనసుందరం ఆమెను గురించి, మాలతి మాత్రమేనా? మోహన సుందరంలోనూ, ఆఖరికి నాలోనూ, కెలికి చూస్తే లోపలో దుఃఖ పురాణం ఉంటుంది.

కోఠీ బస్టాండ్ హడావుడిగా, రద్దీగా ఉంది. రోడ్డు పొడవునా వందలుగా వాహనాలు ఆగిపోయి వున్నాయి. ట్రాఫిక్ జామ్ కాబోలు. ట్రాఫిక్ జామ్‌ను చీల్చుకొంటూ ఒక ఊరేగింపు. ఎవరినో డౌన్ డౌన్ అంటూ. ఇంకెవరినో జిందాబాద్ అంటూ. ఈ ఊరేగింపులు చూస్తే నాలో ఉలికిపాటు. ఇలాంటి ఊరేగింపుల మధ్యనెక్కడో మాలతి హఠాత్తుగా ప్రత్యక్షం అవుతుంది.

ఆసక్తిగా ఆ ఊరేగింపు వెనకనే చాలా దూరం వెళ్ళేవాణ్ణి. హఠాత్తుగా ఏ పోలీసు లాఠీఛార్జితోనో, అందర్నీ పొలోమంటూ పోలీస్‌వ్యాన్‌లో తోయటంతోనో ఆ ఊరేగింపు ముగిసేది.

ఒకసారి, జైలు గోడల మధ్య మాలతి మోకాలిపై తల ఆన్చుకొని, నిస్సహాయపు మౌనంలా ఎదురైన దృశ్యం - చాన్నాళ్ళపాటు నాలోంచి చెరిపి వేసుకోలేకపోయాను. "ఈ ఉద్యమాలు, ఈ ధర్నాలు ఎందుకీ కంఠశోష! ఉద్యమాల కాలం వెళ్ళిపోయింది! ఇప్పుడంతా రాజకీయం, పవర్‌గేమ్. కొంచెం కులం, మరికాస్త మతం - ప్రతి గ్రూపుకీ ఇంతని కోటాలు" నా మాటల్ని మధ్యలో ఆపివేసి "నీ ఆలోచన్లు ఎంత మురుగువాసన వేస్తున్నాయో, నీ మెదడులో శవాలున్నాయని నా నమ్మకం!" అనేది మాలతి.

నాలో ఒక రోషం, ఒక దుఃఖం "అవును నువ్వు పుట్టకముందే ఒకసారి చచ్చినవాణ్ణి! నేనేమిటి నా తల్లీ, తండ్రీ, నా జాతి మొత్తం, కత్తివేటుకు టప్‌టప్‌మంటూ తలలు తెగి... చాన్నాళ్ళుగా శవాలుగా ఉన్నవాళ్ళం! మా పునరుత్థానానికి ఇంకా చాలా కాలం పడుతుంది" అనేవాణ్ణి ఆక్రోశంగా.

"ప్రభో! ఫ్రాయిడ్! ఇక ఈ శవాల కథలు ఆపెయ్యి. తట్టుకోలేను" అంటూ చిన్న జోకుతో వాతావరణాన్ని తేలికపరిచేది మాలతి.

మళ్ళీ 136 ఎక్కి ఉస్మానియా వైపు ప్రయాణం. నగరమంతా రంగు కాగితాలు. పెద్దపెద్ద బానర్లు "వెల్‌కం టు న్యూ మిలియనమ్!" మైకులు, హడావుడి, రంగుదీపాల తోరణాలు, దండలు దండలుగా రోడ్డు చివరన వేలాడుతున్నాయి. ఈ సంబరాల్ని చూస్తే నాలో వింత ఎలర్జీ, కోపం, ఇంత దుఃఖాన్ని అశాంతిని మరచి, ఆల్ ఈజ్ వెల్! అంతటా గొప్ప ఆనందమే అని మనల్ని మోసపుచ్చే ఉత్సవాలివి.

ఒకసారి, యూనివర్శిటీ ఆడిటోరియంలో ఇండో-జర్మన్ మైత్రో, వంకాయో - సింఫోనీ ఏర్పాటు చేశారు. రిథమిక్ హాయి, సుఖవంతమైన శబ్దం, శరీరంపై సన్నని గగుర్పాటు - లోపలి నుండి స్వరాల ఫౌంటెన్ ఎగజిమ్ముతున్నట్లుగా - ఎంతో హాయిగా ఉంది. అయితే ఆవేళే మాలతి వాళ్ళ నాన్న పెట్టుకొన్న అప్పీలును కొట్టివేసింది హైకోర్టు. కింది కోర్టు వేసిన యావజ్జీవ శిక్షను ఖరారు చేసింది. తీర్పు వెలువడి నాలుగైదు గంటలైనా కాలేదు. ఏమీ కానట్టు గంభీరంగా నా పక్కన కూర్చుంది మాలతి.

నాలో వింత కసి! అప్పుడు హఠాత్తుగా లేచి - టాయ్‌లెట్స్ వైపు వెళ్ళి - 'ది ప్రాసెస్ ఆఫ్ యూరినేషన్ అండ్ ది రిథమిక్ బ్లిస్ ఆఫ్ సింఫోనీ - ఎ కంపారిజన్" అంటూ రెండు పేరాల సిద్ధాంత చర్చని రాసి వచ్చాను. ఆ తరువాత వారం రోజులపాటు యూనివర్శిటీ అంతా 'ది సింఫోనిక్ యూరినేషన్' అంటూ ఒకటే చర్చ.

"బ్లాస్టర్డ్ - బ్లడీ అనార్కిక్ ఫిగ్!" అంటూ మాలతి ఆ వారమంతా నన్ను తిడుతూనే ఉంది. ఆ తరువాత చాలారోజుల పాటు టాయ్‌లెట్ గోడలు గొప్ప పొయట్రీ టాబ్లాయిడ్స్ అయ్యాయి.

నిప్పుకోడి రెక్కలు, చెల్లని నాణాలు, మంత్ర శిలాజాలు, ఎండు చేపలు, ఫైవ్‌స్టార్ ఫింప్, లోర్కా, గిన్స్‌బర్గ్ - నెలల తరబడి ఉస్మానీయకులకు డిలైట్ నిచ్చాయి. ఈ పోర్నో కవితలు.

నిజానికి ఇవాళ మాలతితో కలిసి అడ్వకేట్ దగ్గరికి వెళ్ళాల్సింది. కొత్త మిలీనియం సంబరాల కోసం కోర్టు కూడా ముస్తాబవుతుందట. 'రెండు వారాలు ఆగిరాకూడదు" అన్నాడాయన.

మాలతి ముఖంలో నిరాశ, అట్లా నిరాశతోనూ, దిగులుతోనూ ఉన్న మాలతిని చూస్తే, చర్మం వలుస్తున్నట్లు, కడుపులో చేతులు పెట్టి కెలుకుతున్నట్లు అనుభూతి కలుగుతుంది.

* * *

డిసెంబర్ ముప్ఫయి ఒకటి రాత్రి, ఒక అసాధారణమైన అనుభవాన్ని - రెండు వందల రూపాయలు తగలేసి - ఆ రహస్యమైన అనుభవం ఒక సినిమా కూడా కాదు.

పదిహేను నిమిషాల డాక్యుమెంటరీ. ఒక బాంబు పేలుడు సంఘటన. బ్లాస్ట్ అవటం దగ్గర మొదలుపెట్టి - దృశ్యం ఒకటి - ఎర్రటి ధూళిలాంటి భయం గొలిపే విస్ఫోటనం. శరీరంలోంచి ఒక కాలు తెగి, లేచి అట్లా ఎగిరి, వంద మీటర్ల దూరంలో పడటం, దృశ్యం రెండు - ఎర్రగా, వెచ్చగా రక్తం బుసబుసమంటూ తెగిపడిన కాల్లో - ఒక కదలిక. దృశ్యం మూడు - ప్రాణం పోయే ముందర విలవిల. నిస్సహాయమైన, భయకంపితమైన మరణపు కేక.

సిటీలోనే ఒక నెలరోజుల క్రితం జరిగిన బ్లాస్టింగ్. ఇంకో కార్యక్రమాన్ని షూట్ చేస్తున్న వీడియో కెమెరా వాడి టేప్‌లోకి ఈ పావుగంట విధ్వంసం రికార్డు అయ్యింది. హాస్టల్స్‌లో బాగా పాపులర్ అయిందీ విధ్వంసం కాసెట్!

"ఎందుకోసం ఈ అనుభవాన్ని చూస్తున్నట్లు?" అని నాకు నేను ప్రశ్న వేసుకొన్నాను.

"విధ్వంసం, మరణం నాకు ప్రియమవుతున్నాయా?" అని కూడా ప్రశ్నించుకొన్నాను.

ఈ బీభత్సంలోంచి ఏమి వెతుకుతున్నాను. మరణమా? దానితో కలిగే భయమా? లేక ఒక పోరాటానికి సిద్ధం అవటమా?

వీడియో కాసెట్ చూస్తుండగా, మధ్యలో తలుపు చప్పుడు. కంగారుగా తలుపు తీస్తే మాలతి, మోహనసుందరం. ఇంకా నాలుగైదు నిమిషాలుందంటున్నా - బయటకు లాక్కు వచ్చింది మాలతి.

"ఏమైంది నీకు? మరణాన్ని ఎంజాయ్ చేసే స్థితికి వచ్చావా?" మాలతి కోపంగా వుంది.

మోహనసుందరం కల్పించుకొని "రాబోయే శతాబ్దాన్ని ముందుగానే వీడియోలో చూస్తున్నాడు!" అన్నాడు సరదాగా.

"ఇవాళ నుంచి నీ పేరు నిరంజన కాదు ! డెత్" అంది మాలతి తగ్గని కోపంతో.

'రేపు కొత్త మిలీనియం సందర్భంగా ఆడిటోరియంలో ఒక ప్రోగ్రాం జరుగుతుంది. మోహనసుందరం ఒక నాటకాన్ని రాశాడు. ఆ ప్రోగ్రాంలో చెయ్యడానికి నాటకంలో మరణం అనే క్యారక్టర్ ఉంది. దానికి ఎవరినన్నా సజెస్టు చేస్తావని నీ దగ్గరకు వచ్చాము. ఆ రూమ్‌లో నిన్ను చూశాక, మరణం పాత్రకు నువ్వే కరెక్టుగా సరిపోతావు అనిపిస్తుంది. రేపు ఉదయం ఏడింటికి మోహనసుందరం ఇల్లు పొయిట్రీ కేఫ్‌కు రా. అక్కడో రిహార్సిల్ వేసుకొని, సరాసరి ఆడిటోరియంకు వెళదాం'' మాలతికి ఇంకా కోపం తగ్గినట్లు లేదు.

మాలతి, మోహనసుందరం వెళ్ళిపోయారు. చీకటి, నిశ్శబ్దం. ఎక్కడో క్వేక్, క్వేక్ అంటూ అరుస్తున్న పక్షి. ఆ అరుపు భయం గొలిపేలా ఉంది. అద్భుతమైన రంగులు, మత్తయిన సౌగంధాలు, రాత్రి పాటలు, లలిత లలితంగా, భగవంతుని వాగ్దానంలా ఉండే రాత్రులు కావివి.

* * *

నిద్ర లేచాను. చల్లనిగాలి ఒంటిని గిల్లి నిద్రలేపింది. కళ్ళు మూసుకొనే ఉన్నాను. ఎదురుగా గోడనిండా బొమ్మలు. అతికించినవి. బొమ్మలే కాని అవి అనుభవానికి సింబల్స్.

మంచుకొండలు, నీలాకాశం, ఎగిరే పక్షి, ఆకుపచ్చని లోయ, ఫ్యాక్టరీ పొగగొట్టం, హోచిమన్, చెగువేరా, యుద్ధనౌక, లామినేట్ చేయించిన నాన్న ఫోటో, గౌతమ బుద్ధుడూ, అంబేద్కర్, థాయ్‌లాండ్ ఫుడ్ ఐటమ్స్, సుమో మల్లయోధుడు, జాకీచాన్, షారూక్‌ఖాన్, కాజోల్... ఇవాళ ఎవరు? ఏ అనుభూతి నా రోజును నింపబోతుంది. ఎ టేస్ట్ ?

కుడి కన్ను తెరిచాను. డెమీమూరు నగ్నవక్షం. కంటినిండా కోర్కె, కామం, ఎరోటిక్ ఫాంటసీలు నిండి, కుడిరెప్ప మూసి, ఎడమ కన్ను తెరిచాను. రిజర్వుబ్యాంక్ ఎంబ్లమ్. దానిపై ఎగురుతున్న మనీబర్డ్స్ - గొప్ప కాంబినేషన్ ఈ రోజు పేరు శృంగారగీతం.

అందులో కాస్త ధనయోగం కూడా లేచి, చకచకా తయ్యారై రోడ్డుపై కెక్కి -

ఎకనామిక్ టైమ్స్ పేపరు కొనుక్కొని, షేర్స్ కాలమ్ పేజీని చించుకొని, జేబులో కుక్కుకొని - మిగతా పేపరును, నలిపి రోడ్డు చివర విసిరి - టీ స్టాల్‌కు వెళ్ళి - వెచ్చని ఇరానీ ఛాయ్ నాలుకపై పడి - మెల్లగా గొంతులోకి దిగుతుంటే - హుషారుకు బదులు - ఒక దుఃఖం, ఒక క్రోధం - ఐవజ్ హర్ట్ - గాయం గాయం ఎంత మాటంది మాలతి -

మరణానికి ప్రతీకనని. షి యీజ్ క్రేజ్ !

ఈ మోహనసుందరం మాత్రం - నిన్న నిన్న నిన్నలోకి ప్రపంచాన్ని నెడతానంటాడే - గోడ మీద ఎప్పటిదో ఒక చిరిగిపోయిన బొమ్మను పెట్టుకొని - అట్లాగే జీవించాలంటాడే - నిన్నకు జబ్బు చేసిందంటే వినడేం? కుళ్ళుతున్న వాసన తెలియటం లేదూ. జరగాల్సిన విధ్వంసం జరిగేపోయింది!

ఎవడో మనల్ని ముందుకో, వెనక్కో వాడిష్టం వచ్చిన దిశలో నడిపే రోజులొచ్చాయి.

దేన్ని ఆపుతాడు ఈ మోహనసుందరం? సెల్‌ఫోన్, యూరో డాలర్, బులియన్ మార్కెట్టు, టెర్మినేటర్ విత్తనం, పోర్నో వెబ్‌సైటు, పతనమవుతున్న రూపాయి, మల్టీ నేషనల్స్, అమెరికన్ ఈగిల్ కిందనున్న దేహాలు - దేన్ని ఆపుతాడు?

ఎదురుగా అయిదో నెంబరు బస్సు. మెహిదీపట్నం. పొయిట్రీ కేఫ్, మోహనసుందరం యింటికి. బస్సులోకి అడుగుపెడుతున్నానా? ఏదో గొప్ప వాయేజ్‌లోకి వెళుతున్నట్లుగా - కిటకిట క్రిక్కిరిసి ఉన్న మానవ సమూహంలోకి, బలవంతంగా లాగబడుతున్నట్లుగా - "కొత్తదనం, కొత్తదనం కావాలి" "అన్నా! నువ్ సంజాయించరాదూ?" "ఇండికా, ది క్రీమ్ కార్". "ఎలియనేషన్ ఎక్కడ లేదు. ఊపిరితో, ఇట్లా చూడు నాకంటి పాపతో" "డోంట్ బి ఎగ్జైటెడ్" "దె కిల్డ్ యూనిట్ ట్రస్ట్" "పిల్లగాన్ని సంజాయించరాదూ" "కిర్‌ర్‌ర్..." "అబ్బా సడన్ బ్రేక్ వేసినాడు" "గుండె జల్లుమన్నదనుకో" "ఎర్రజెండా గుంపు" "డ్రైవర్! ఎంతసేపు ఆగాలి!"

చప్పుళ్ళు చంపివేసి, నిశ్శబ్దం మాత్రమే, రోజులో ఒక్క క్షణమైనా - మొత్తం ప్రపంచంలో శబ్దాలు ఆగిపోయి - ఎంత గొప్పగా వుంటుందో? ఆ నిశ్శబ్దంలో ఒక సన్నటి గొంతు, ఏదో ఒక ఆలాపన - చల్లగా మృదువుగా బాల్యపు స్వప్నంలా - మధురంగా వినిపిస్తుంటే - ఆ దృశ్యం ఎప్పుడయినా తటస్థపడుతుందా?

జనం ఒక్కొక్కళ్ళే దిగుతున్నారు. ఇద్దరో ముగ్గురో ఉన్నారు. బయట ఒక పెద్ద ఊరేగింపు. స్త్రీలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా అన్ని ప్రజా సంస్థల ఊరేగింపు. ఊరేగింపు సుదీర్ఘంగా సాగిపోతుంది. ఊరేగింపులోంచి జారి ఓ ముగ్గురు బస్సులోకి ఎక్కారు. డప్పు, కంజర, పొడవాటి ఫ్లూట్ అలసటగా, నిశ్శబ్దంగా వున్నారు వాళ్ళు. ఊరేగింపు వెళ్ళిపోయి బస్సు కదిలింది.

బొయ్‌మంటూ సన్నగా ఫ్లూట్ మోగింది. పక్కనున్న డప్పు, కంజెర. కుర్రవాళ్ళలోనూ ఉత్సాహం రగిలింది. గొప్ప లయ. మత్తుగా మోగుతున్న ఫ్లూట్. దిగంతాలవైపు ప్రయాణిస్తూ - వెనుక నేపథ్యంగా వేణువు పాట.

చిన్న జర్క్‌తో బస్సు ఆగింది. కలలాగా హఠాత్తుగా వాళ్ళు ముగ్గురూ అదృశ్యం అయ్యారు. బరువుగా ఊపిరితీస్తూ యాభైయేళ్ళ మనిషి. ఆస్మా పేషంట్ కాబోలు. తలచుట్టూ మఫ్లర్ చుట్టుకొని, ఒంటి నిండా శాలువా కప్పుకొని - మాంసం ముద్దలాగా సీట్లో ముడుచుకొని కూర్చున్నాడు. జేబులోంచి నెబ్యులైజర్ తీసుకొని ఉఫ్... ఉఫ్ మంటూ ముక్కులోపలికి స్ప్రే చేసుకొన్నాడు. కొంచెం రిలీఫ్ వచ్చినట్లయింది. ఊపిరి కాస్త తేలికయి - అతని ముఖంలో ఉత్సాహం రాజుకోవటం మొదలుపెట్టింది. నావైపు చూసి, సన్నగా నవ్వి, "ఈ నెబ్యులైజర్ నాకు గొప్ప వేదాంతాన్ని నేర్పుతుంది. ఎప్పటికప్పుడు ప్రాణం దుర్భరంగా అనిపించి - ఇంక చాలు ఈ జీవితం అనిపిస్తుంది. యుథనేసియా గురించి సీరియస్‌గా ఆలోచించటం మొదలుపెడతాను. ఇది స్ప్రే చేసినాక మళ్ళీ రెండు గంటల ఆయువు వస్తుంది. మళ్ళీ ఉత్సాహం. చాలా ఏళ్ళు ప్రయాణించాలని కోరిక." నెబ్యులైజరే కాదు అతనే ఫిలాసఫర్‌లా కనిపిస్తున్నాడు. బోలెడంత సఫరింగ్. కొంచెం రిలీఫ్ - ఇందాకటి మధురమైన సంగీతమూ నిజమే, ఈ సఫరింగ్ నిజమే. ఈ బస్సు నా వేదాంత పాఠశాల.

బస్సు దిగి, మసాబ్ టాంక్ పైన. ఇంకా ఫర్లాంగు దూరం నడవాలి మోహనసుందరం పొయిట్రీ కేఫ్‌కి. కలలు, కోర్కెలు, చెమట, చిత్తడి, నవ్వులు, కేరింతలు అనంతమైన శబ్దాలుగా ఉంది చౌరస్తా.

తోసుకొంటూ, త్రొక్కుకొంటూ ఎడాపెడా ఉర్దూపదాల సెంటు పూసుకొన్న తెలుగు మాటల్ని వెదజల్లుతూ, హడావుడిగా ఉంది.

మాసాబ్‌టాంక్, బ్రిడ్జి మధ్యన, మెట్ల పక్కన - వాటే సీన్? చిలుక పస్తీ చెప్పేవాడు. పంచె, తలకట్టు, ఉహూ! వీడు ఆధునికుడు - ప్యాంటు, షర్ట్, కళ్ళజోడు. కళ్ళజోడు వెనుక లోతుగా బురద గుంటల్లా ఉన్న కళ్ళు. అటువైపు నడిచాను. నన్ను ట్రాప్ చేసానని సంబరపడుతున్నాడు వాడు.

"కూర్చోండి సార్! గొప్ప భవిష్యత్తు ఉన్నవాళ్ళు! మహానుభావుల జాతకం మీది"

మైగాడ్ వీడు బలమైన గాలమే వేశాడు. టప్‌మంటూ తగులుకుంది గుండెకు. కూర్చొని, "కొత్త శతాబ్దం వచ్చింది. ఈ శతాబ్దంలో నా భవిష్యత్తు ఎట్లా ఉంటుందో చెప్పగలవా?" అన్నాను.

వాడు ఆసక్తిగా సీరియస్‌గా ముఖం పెట్టి, నిజంగానే గొప్ప సూత్ - సేయర్‌లా ఫీలయి, ఇష్టమైన రంగు, పువ్వు ఏవేవో అడిగి, చివరిగా "తరుచూ వస్తుండే కల ఏమిటో చెప్పండి!" అన్నాడు.

ఇదో హిప్నోసిస్. వెనక్కు వెళ్ళే మార్గమే లేదు. అసంకల్పితంగానే నోరు తెరిచాను. "గొప్ప సముద్రం. ఒడ్డున స్నేహితులం అందరం. మాలతి పాట పాడుతుంది. అనంతమైన దుఃఖం. మాలతి చరిత్ర గురించి పాడుతుంది. ఇవాళ్టిని ఇక్కడే ఆపేద్దామా? అని పాడుతుంది.

సర్వశక్తుల్ని ఉపయోగించి కాలాన్ని ఆపివేద్దామా అని పాడుతుంది. నేను ఒడ్డుపైనే కూలబడి ఇసుకను తవ్వుతున్నాను.

ఎప్పుడో చిన్నతనంలో పాతిపెట్టిన నా కలల కోసం, తవ్వుతూనే ఉన్నాను. లోతుగా, లోతుగా ఊహూ! ఏమీ కనబడటం లేదు. దుఃఖం వస్తుంది. సముద్రపు హోరు, మాలతి పాట, నా దుఃఖం - హఠాత్తుగా మోహనసుందరం వచ్చాడు.

సింఫోనీ కండెక్టర్‌లా - 'ఇక చాలు ఆపండి. ఇళ్ళకు పోదాం' అంటు న్నాడు. అనటం కాదు. అదో కమాండ్. షాట్ చిత్రించిన తరువాత పేకప్ చెప్పే దర్శకుడిలా 'వద్దు ఈరోజు వెళ్ళిపోతుంది' అంటూ మాలతి పాడుతూనే ఉంది.

'డోంట్ వర్రీ! రేపుంది కదా. రేపటి కోసం జీవిద్దాం' అంటున్నాడు మోహనసుందరం.

ఊడివచ్చిన పెయింటింగ్‌లా సముద్రాన్ని, గుప్పిట మధ్య ఇమిడ్చిన పిట్టలా పాటను, చిన్న పాపాయిలాగా భుజంపై చేయివేసి మాలతినీ, అంతట్నీ వెంట తీసుకెళుతున్నాడు మోహనసుందరం. నేను అరుస్తూనే వున్నాను. 'రేపటిలో ఏముంది?' అంటూ"

చిలకపస్తీవాడు కంగారుపడ్డాడు. ముఖం తెల్లబోయింది. వాడికేమీ అర్థం అయినట్లు లేదు. బుర్ర గోక్కొంటూ పంజరంలోంచి చిలుకను బయటకు తీశాడు. కుర్రకుర్ర్ అంటూ శబ్దం చేస్తూ, చిలక బయటికి వచ్చింది. వందకు పైగా ఉన్న కవర్లపై అటూ ఇటూ తిరిగింది.

చిలకపస్తీవాడు నా పేరు చెప్పి "సార్ కోసం ఒక కార్డు తియ్యి" అన్నాడు. "సార్ కోసం ఒక భవిష్యత్తును, ఒక సత్యాన్ని బయటికి తియ్యి" అంటూ దాన్ని ఉత్సాహపరుస్తున్నాడు.

చిలుక అటూ ఇటూ తిరిగి ఒక కార్డు బయటకు తీసింది. బాల కృష్ణుడు, నోట్లో సకల భువనాల్ని చూపిస్తున్నాడు వాళ్ళమ్మకు.

"శుభం! గొప్ప అద్భుతం జరగబోతంది. మీ జీవితంలో..." అన్నాడు వాడు. కార్డు లోపల రాసి ఉన్న వాక్యాల్ని చదివాడు. "అద్భుతాలు చేసే మనిషి మీకు ఎదురౌతాడు. అతని ద్వారా మీరు అనుకొన్నవన్నీ జరుగుతాయి. డబ్బు సుఖాలు అన్నీ, అయితే ఒక ప్రమాదం పొంచి ఉంది జాగ్రత్త" అని వుంది.

లేచి, వాడి చేతిలో వందరూపాయల నోటు పెట్టి, వాడివైపు కన్ను గీటి "ఆ అద్భుతాలు చేసే మనిషి నేనే! ఆ సుఖం నేనే! ఆ ప్రమాదం నేనే! నన్ను బాగా స్టడీ చేసినందుకు ఈ వందా బహుమానం. చిన్న సలహా. కార్డు లోపల వాక్యాల్ని మార్చు. అద్భుతాలు జరిగే కాలం వెళ్ళిపోయింది. కొత్త శతాబ్దం వచ్చింది. రాబోయేదంతా దుఃఖమే. మరణమే. రేపటిలో ఏమున్నదనే ప్రశ్నే మానవుడికి మిగిలింది. అన్ని కార్డుల్లోనూ ఈ ప్రశ్నే రాయి. గుర్తుంచుకో. బై బై" అంటూ చకచకా రోడ్డు దిగి, మోహనసుందరం ఇంటివైపు నడిచాను.

* * *

"నాటకానికి రెండు చావులూ, మూడు పుట్టుకలూ – అవును ముందు రచయిత దుఃఖంలోంచి పుడుతుంది. పేపరుపైన చచ్చిపోతుంది. నటుల భావోద్వేగంతో మళ్ళీ పుడుతుంది. స్టేజిపై మరోసారి చస్తుంది. చివరిగా ఆడియన్స్ రెస్పాన్స్‌లో పునరుత్థాన్ని పొందుతుంది."

మోహనసుందరం నాటకం గురించి లెక్చరిస్తున్నాడు. మాలతి రాలేదు. పొయిట్రీ కేఫ్ ముందున్న అరుగులాంటి ప్రదేశంలో కూర్చుని, నేను, మరో ఇద్దరు కుర్రాళ్ళు, అతన్ని దీక్షగా వింటున్నాము.

హఠాత్తుగా మోహనసుందరం గొంతెత్తి పాట అందుకొన్నాడు. డైలాగులు ప్రాక్టీసు చేస్తున్న ఒక కుర్రవాడు అట్ట తీసుకొని లయాత్మకంగా దరువు వేస్తున్నాడు. జానపద గీతం, బొంగురుగా, వెదురు చెట్లన్నీ ఫెళఫెళమంటూ విరుగుతున్న చప్పుడు. అతని స్వరం క్రమక్రమంగా పెద్దదవుతూ – భూమికి ఆవైపు వరకూ వినబడేంతగా – గొప్పగా ఊగిపోతున్నాడు. అంతకంతకూ స్వరాన్ని పెంచి - కుర్రాడొకడు టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. టేప్‌లో పోలీసు ట్రక్కులు ప్రయాణిస్తున్న చప్పుడు విసురుగా, వేగంగా - టేప్ రికార్డర్‌లోని శబ్దాలకు పారలల్‌గా మోహనసుందరం కూడా పాడుతున్నాడు.

టేప్ రికార్డర్ లోంచి ట్రక్కుల ప్రయాణం ఆగిపోయి, టకటకమంటూ పోలీసులు మార్చ్ చేస్తున్న చప్పుడు. తలుపులపై బాయ్‌నెట్లతో ధన్‌ధన్‌మని

పాడుస్తున్న చప్పుడు. లోపలి గదిలో - సన్నని నవ్వు, కేరింత, ఇరవైమంది పిల్లల అల్లరి, తలుపు ఫెళ్ళుమని విరిగిన చప్పుడు - మోహనసుందరం ఆప కుండా పాడుతూనే వున్నాడు. ప్రపంచానికంతా వినబడే మహా స్వరంలా - పొట్టలో కుమ్మిన శబ్దం. సార్ సార్ అంటూ పిల్లలు గొల్లుమన్న శబ్దం. అమ్మా అన్న ఆర్తనాదం. నేలపై పొర్లించి మనిషిని లాక్కువెళుతున్న చప్పుడు. భయ విహ్వలతతో, దుఃఖంతో కూడిన ఒక స్వరం 'ఆయన్నేమీ చెయ్యకండి! ఆయ న్నేమీ చెయ్యకండి!' అంటూ పెద్దగా అరుస్తున్న గొంతు ఆ గొంతును గుర్తు పట్టాను. అది మాలతిది. టేప్ రికార్డర్‌లోంచి, అన్ని చప్పుళ్ళు ఆగిపోయి మాలతి ఏడుపు మాత్రమే వినిపిస్తుంది. మోహనసుందరం పాట క్రమంగా ఫేడౌట్ అయినట్లుగా ఆగిపోయింది.

"ఇవాళ మన నాటకంలో మొదటిరంగం యిదే. మాలతి తండ్రిని పోలీసులు అరెస్టు చెయ్యటం. అతని కోసం మాలతి చేసిన ప్రయత్నాలు, పోరాటం. ఇదే నాటకానికి కథావస్తువు.

"ఇందులో మరణం అనే పాత్ర దాదాపు అన్ని రంగాల్లోను కనిపిస్తుంది. దూరం నుంచి ఒక పాట పాడేవాడులాగా, ఒక ప్రేక్షకుడిలాగా కనిపిస్తుంది. ఈ పాత్ర ఒక మెటాఫర్ ఒక అణిచివేతకు, హింసకు, విధ్వంసానికి. మొదటి రంగంలో - జానపద గీతం పాడే గాయకుడిలా మరణం ప్రత్యక్షమవుతుంది. రెండో రంగంలో పొలిటీషియన్‌లా. మూడోరంగంలో..." మోహనసుందరం మాటలుపూర్తి కాకుండానే, ఒక యూనివర్శిటీ కుర్రాడు వగర్చుకొంటూ - "అన్నా! అర్జెంటుగా గాంధీ హాస్పిటల్ పోవాల. లే!" అంటూ కంగారుపెట్టేడు.

"ఏమైంది?" అన్నాడు తాపీగా మోహనసుందరం.

"మాలతి వాళ్ళ నాన్న రాజయ్య సార్‌ను జైల్లో చంపేసినారు. కడుపు నొప్పితో చచ్చిపోయాడని సర్టిఫై చేసి మార్చురీకి పంపారు. మాలతక్క అక్కడే ఉంది. బాడీని కూడా యియ్యరట" మోహనసుందరం ముఖంలో క్షణంపాటు కంగారు, కోపం.

వెంటనే తమాయించుకొని, లేచి "పద వెళ్దాం" అంటూ అందర్నీ బయలుదేరదీశాడు.

వేగంగా నడుస్తున్నాడు మోహనసుందరం. ఎటు చూసినా వ్యాధులే. నాగుపాములు కాళ్ళకు చుట్టుకున్నట్లుగా వార్డుల పొడవునా వంగిపోయి, నలిగిపోయి, శుష్కించి, దుఃఖించి, మరణం వద్దువద్దని విలపిస్తూ ప్రాణం పొయ్యండని ప్రార్థిస్తూ - వార్డులన్నీ దాటుకొని - చివరన ఉన్న విశాలమైన గది దగ్గర ఆగాడు. మార్చురీ గది. గది ముందు పిట్ట గోడనానుకొని మాలతి.

గంభీరంగా "నేను శవాన్ని చూడాలి!" ఒక్కసారిగా పెద్దగా అరిచింది మాలతి.

"సూపరింటెండెంట్ నడిగితే పోలీసుల పర్మిషన్ కావాలంటూ మొండి కేస్తున్నాడు"

గది వెనుక ఒక అద్దాల కిటికీ వుంది. మోహనసుందరం లేచి, ఓ లావాటి రాయి తీసుకొని పెళ్ళుమని ఆ కిటికీని పగలగొట్టాడు. మనిషి పట్టే ఖాళీ వచ్చింది. "పద. శవాన్ని చూద్దాం" అంటూ లోపలికి నడిచాడు.

వెంట మాలతీ, నేనూ, బయట వార్డుబోయ్‌ల, సెంట్రీల కేకలు పట్టించుకోకుండా లోపలికి నడిచాము. శవం ముఖం నిండా తెల్లటి సైనుగుడ్డ కప్పి వుంది. గుడ్డపైకి తీశాడు మోహనసుందరం. తల పగిలి ఉంది. రక్తం నల్లగా గడ్డగట్టి - మాలతికి భయం సరే, దుఃఖమయినా రాదే.

స్ట్రెచర్ పక్కనే ఉన్న లుంగీని, చొక్కాని మడత పెట్టుకొని బయటకు వచ్చింది మాలతి. నలుగురు పోలీసులు హడావుడిగా వస్తున్నారు. వాళ్ళను లెక్క చెయ్యనట్లుగా "పద. ప్రెస్‌మీట్ ఒకటి పెడదాం ముందు" అంటూ ముందుకు నడిచాడు.

హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చినదానిలా మార్చురీలోంచి తెచ్చిన బట్టల్ని నేలపై పెట్టి, స్కూటర్‌లోంచి పెట్రోలు తీసి, దానిపై పోసి, టఫ్‌మని అగ్గిపుల్ల గీసి వేసింది.

భగ్గుమని మండింది. ఆ మంట పక్కనే కూలబడి పెద్దగా ఏడవటం మొదలుపెట్టింది. చాలాసేపు ఏడ్చి, లేచి కళ్ళు తుడుచుకొని, ఒక యుద్ధానికి సిద్ధమైన దానిలా తయారైంది మాలతి.

"నిరంజనా! నువ్వు యూనివర్శిటీ వైపు వెళ్ళి మన కుర్రవాళ్ళని మొబలైజ్ చెయ్యి. నేనూ, మోహనసుందరం, చిన్న ప్రెస్‌మీట్ పెట్టి అటువైపే వస్తాము" అంటూ ముందుకు కదిలింది.

* * *

యూనివర్శిటీ అంతా కళకళలాడుతోంది. కొత్తగా రంగులు పులుముకొని, రంగు కాగితాలు, వాద్య సంగీతాలు - గొప్ప పండుగ వాతావరణం వచ్చేసింది. "వెల్‌కమ్ 2000 ఇయర్" పెద్ద బెలూన్ ఆకాశంలో వేలాడుతుంది. ఒక మహాద్భుతం ఏదో జరిగినట్లుగా ఉందా ఉత్సవ వాతావరణం.

ఆడిటోరియంలో పెద్ద ఫంక్షన్. ఈ శతాబ్దపు మేధావులందర్నీ గుర్తు చేసుకొంటూ, వాళ్ళకోసం గొప్ప సభ. శతాబ్దాన్ని దాటి మిలినియమ్‌లోని కొంత

మంది గొప్పవాళ్ళని - నన్నయ, కృష్ణదేవరాయలు ఇంకా ఎవరెవరో జనం పోల్చుకోలేని వాళ్ళని కూడా స్మరించుకోవటం అట.

గవర్నరు, పద్మశ్రీలు, పద్మభూషణ్‌లు చాలామంది వచ్చారు. పది గంటలకు ఆడిటోరియమంతా కిటకిటలాడుతుంది.ఎవరికైనా మాలతి దుఃఖ గాథ చెప్పాలని, చిన్న ప్రొటెస్టు, పోనీ ఒక ఊరేగింపు ఊహ వినే మూడే లేదు. రంగుల బాడ్జీలు తగిలించుకొని, సుదీర్ఘమైన ఉపన్యాసాలు రాసుకొని- విద్యార్థి నాయకులంతా హడావుడిగా వున్నారు. ముందు వరుసలో పదిమంది కవులు, ఐదుగురు ఆధునికులు, మరో ఐదుగురు ప్రాచీనులు. బహుశా పద్యాలు చదువుతారు కాబోలు. కొత్త మిలినియమ్‌పై కవి సమ్మేళనమట.

ఆడిటోరియంలో ప్రతి ఒక్కడూ గొప్ప జ్ఞాని, బాగా చదువుకొని వుంటాడు అనిపించే ముఖాలు పెట్టుకొని, ఇంటలెక్చ్యువల్ క్రీచర్స్ అనిపించు కోవాలని తపన. ఆ ముఖాలపైని ముసుగు లాగేస్తే లోపలో తోడేలో, చిరుతో, మరో జంతువో ఉండి తీరుతాయి. సక్కర్స్, బ్లడీ సక్కర్స్ !

విసుగ్గా బయటకు వెళుతుంటే, "నిరంజనా! నీకోసమే చూస్తున్నాను. మోహనసుందరం నాటకాన్ని కాన్సిల్ చేశాము. ఆ టైమ్‌లో నీదో స్పీచ్ ఎరేంజ్ చేశాము. 'ది న్యూ మిలినియమ్ అండ్ ఎ హోప్' గురించి మాట్లాడు" అంటూ స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీ రామకృష్ణ పని పురమాయించాడు.

"మర్చిపోవద్దు. ప్రొఫెసర్ కూడా చెప్పాడు. లాస్టియర్ నువ్విచ్చిన ఉపన్యాసాలు మొత్తం యూనివర్శిటీనే ఒక ఊపు ఊపాయి" మరోసారి హెచ్చరించాడు.

జేబులోంచి వెయ్యిరూపాయలు తీసి, ప్రీవియస్ కుర్రాణ్ణి పిలిచి, తార్నాకా దాకా వెళ్ళి నాలుగు రమ్ము సీసాలు పాక్ చేయించుకు రమ్మని పంపాను.

వాడు "ఎందుకన్నా?" అంటూ ఆశ్చర్యంగా చూశాడు. "ఉపన్యాస మివ్వాలట. మూడ్ రావద్దూ!" అన్నాను.

మీటింగ్ మొదలైంది. పండితులు మంత్రోచ్చారణ చేశారు. గొప్ప మనిషి ఒకాయన జ్యోతిని వెలిగించాడు. అమ్మాయిలు నలుగురు కలిసి సరస్వతీ వందనాన్ని ఆలపించారు.

వేదికపైకి ఒక్కొక్కళ్ళనే ముఖ్య అతిథుల్ని పిలుస్తున్నారు. ముందుగా గత శతాబ్దం మొదట్లో పుట్టి, ఇంకా బ్రతికున్న మేధావులు. కవులు, శాస్త్రవేత్తలు, గాయకులు వచ్చారు. వేదికపై పెద్ద సంతర్పణలా ఉంది. దాదాపు యాభైమంది.

ముందు వరుసగా పదిమంది కవులు, కవి సమ్మేళనం చివరి అంశం కాబోలు.

స్టూడెంట్ లీడర్ రామకృష్ణ స్టేజీ ఎక్కాడు. అందరికీ ఆహ్వానమన్నాడు. ఆ తరువాత కొత్త మిలినియమ్ సంవత్సరానికి స్వాగతమన్నాడు. అంతలోనే వాడో కవిత చదవటం మొదలుపెట్టాడు.

వాడి కవితకు జనంలో గగ్గోలు. "ఇంక చాలు. ఇంక చాలు నీ పైత్యం" అంటూ గొడవ.

ఉపన్యాసాలు మొదలైనాయి. మేలుకొన్న ఆర్థికవ్యవస్థ గురించి, చదువుల్లో సంస్కరణల గురించీ, కమ్యూనికేషన్ల గురించి ఒకటే నసగా మొదలై నాయి ఉపన్యాసాలు.

కుర్రవాడు, ప్లాస్టిక్ సంచిలో ప్యాక్ చేసుకొచ్చిన రమ్ము బాటిల్స్ తెచ్చి ఇచ్చాడు. కొంచెం గోడవారకు వెళ్లి ఒక రమ్ముబాటిల్ మొత్తం గటగటా తాగే శాను. గొప్ప దుఃఖంతో నడుస్తున్న జంతువులా తూలుతూ ముందు వరుసలో కూర్చున్నాను.

మిలీనియమ్ మహానుభావుల గురించి ఉపన్యాసాలు మొదలైనాయి. ఆంధ్రా యూనివర్శిటీ నుంచో ప్రొఫెసర్, ముందు నన్నయ కావ్యంలోని పద్యాల్ని శ్రావ్యంగా చదవటం మొదలుపెట్టాడు. "వద్దురా బాబూ! కనీసం శ్రీశ్రీ అయినా బెటరు" అంటూ వెనుక నుంచి అరుపులు.

మరొక శతావధాని, పెద్దన గురించి, శ్రీకృష్ణ దేవరాయల గురించి మొదలుపెట్టాడు. వరూధిని రొమ్ముల్ని, చంకల్ని పెద్దన్న వర్ణించిన తీరును అమోఘంగా చెప్పేడు. అప్పుడు తీశాను రెండో బాటిల్. తలను పక్కకు వంచి, మొత్తం సీసా గటగటా తాగివేశాను. రాజ్యాంగాన్ని గురించి, ప్రజల హక్కుల గురించి స్వాతంత్ర పోరాట యోధుల గురించి మరో వక్త మాటలాడటం మొదలుపెట్టాడు. ప్రజల హక్కులు అనే మాట వినబడి, నా లోపల ఒక వింత మృగం, ఉలిక్కిపడింది. మూడో సీసా అప్పుడు తీశాను.

"ఇప్పుడు నిరంజన్, రీడర్, పొలిటికల్ సైన్సెస్ - 'కొత్త మిలినియమ్- ఒక ఆశాగీతం' అనే విషయం గురించి మాట్లాడతాడు" అన్న ఎనౌన్స్‌మెంట్ వింటూనే నాల్గో సీసా బయటకు తీసి, గుటగుటమంటూ మొత్తం ఖాళీ చేశాను.

గునగున నడుస్తూ, పొట్ట లోపల రమ్ము, అటూ ఇటూ కదుల్తూ సరస్సులను లోపల మోస్తున్న మానవుడిలా ఉన్నాను.

మైకు ముందుకు వెళ్ళి, గొంతు సవరించుకొని, వేదిక పైనున్న మాన్యశ్రీ, ఫలానా, ఫలానా అని అందర్నీ పేరుపేరునా పలకరించి -

"గత మిలినియమ్, శతాబ్ది గురించి నేనెక్కువ చెప్పను. అది మరణిం చింది. శవాల గురించి ఎందుకు మాట్లాడుకోవటం" అని ఆగి, "నేనేదైనా మాట్లాడితే అది కొత్త మిలినియమ్ గురించే" అంటూ ఒక్కసారిగా కళ్ళు తిరిగి, భూమి అదిరి, లోపల నుంచి, ఒక పెను దుఃఖమో, మహోద్రేకమో బయటకు వస్తున్నట్లుగా - భళ్ళుమని వాంతి అయి, లోపలనున్న పులిసిన సరస్సు బయటకు వస్తున్నట్లుగా - పులిసిన, జిగటగా వాసన వేస్తున్న రమ్ము -

"ఫూ...." అంటూ ఆడిటోరియమ్ వైపు ఊసి, ఆ వాంతి అట్లా అలలు అలలుగా ఆగకుండా వస్తూనే ఉంది. నా నోట్లోంచి సముద్రం బయటకు వస్తున్నట్లుగా -

"కొత్త శతాబ్దం, కొత్త మిలినియం గురించి నాకున్న అభిప్రాయం ఇదే!" అంటూ వేదికపైన, ఆడిటోరియంలోనూ మడుగులా ప్రవహించే రమ్మును తొక్కుతూ క్రిందకు దిగాను.

*- స్వాతి సచిత్ర మాసపత్రిక, సెప్టెంబర్ 1999*